ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 336 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 11 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## లోక్‌సభ బరిలో మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్

2లో..

# బీఆర్ఎస్‌కు షాక్

## బీజేపీలోకి మరో నలుగురు కీలక నేతలు

హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణలో రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది. ఓవైపు.. ప్రధాన పార్టీలన్ని గెలుపుగుర్రాలకు ప్రకటించే పనిలో నిమగ్నవుతుంటే.. మరోవైపు జంపింగ్ జపాంగుల పర్వం కూడా గట్టిగానే నడుస్తోంది. ప్రధానంగా.. ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ నుంచి నేతల వలసలు ఎక్కువగా నడుస్తున్నాయి. మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలంతా ఒక్కొక్కరిగా కారు దిగుతున్నారు. అందులో.. కొందరు హస్తంతో దోస్తీ కడుతుంటే.. మరికొందరు కాషాయ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే కొంత మంది అధికార కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటుంటే.. ఇక కొందరు మాత్రం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని నమ్ముకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మరో నలుగురు బీఆర్ఎస్ నేతలు.. బీజేపీలో చేరారు. మహబూబాబాద్, ఆదిలాబాద్ మాజీ ఎంపీలైన సీతారాం నాయక్, గోడం నగేశ్‌తో పాటు హుజూర్ నగర్, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, జలగం వెంకట్రావు బీజేపీ కండువా కప్పుకున్నారు. వీళ్లంతా ఢిల్లీలో తరుణ్ చుగ్ సమక్షంలో.. కాషాయ కండువా కప్పుకున్నారు. కాగా.. ఈ కార్యక్రమంలో.. రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. అయితే.. ఇప్పటికే ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు కూడా బీజేపీలో చేరారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కాషాయ తీర్థం పుచ్చుకోగా.. నాగర్ కర్నూల్ ఎంపీ పీ రాములు కూడా బీజేపీలో చేరిపోయారు. కాగా.. ఇటీవల బీజేపీ ప్రకటించిన తొలిజాబితాలో.. నాగర్ కర్నూల్ నుంచి సిట్టింగ్ ఎంపీ పీ రాములు కుమారుడు భరత్‌కు బీజేపీ అధిష్ఠానం టికెట్ కూడా ప్రకటించిన విషయం తెలిసిందే.




## ముందుంది ముసళ్ళ పండుగ

### సీఎం రేవంత్‌పై ఈటల సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,మార్చి10(ప్రభాత ఉదయం): చప్పట్లు కొట్టగానే రెచ్చిపోయి మాట్లాడేవారు కొంతమంది ఉంటారని, అలాంటివారు ఎవరి మీద పడితే వారి మీద, ఏది పడితే అదే మాట్లాడుతారని, కానీ అలాంటి వారికి ముందుంది ముసళ్ళ పండుగ అంటూ మల్కాజ్ గిరి లోక్ సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘాటుగా హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తనను పట్టుకొని మల్కాజిగిరికి ఈటల రాజేందర్‌కు సంబంధం ఏంటని అడుగుతున్నాడని, ఈటల రాజేందర్ ఒక కులానికో, ప్రాంతానికో, మతానికో సంబంధించిన బిడ్డ కాదనే విషయాన్ని రేవంత్ గుర్తుంచుకోవాలన్నారు. ఈ 22 సంవత్సరాల కాలంలో తెలంగాణ బిడ్డగా, ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. రాష్ట్రంలో తొలి ఆర్థికమంత్రిగా వచ్చినప్పుడు శూన్యం నుంచి ఒక బడ్జెట్ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. ఈనాడు రాష్ట్ర ఆర్థికస్థితి ఏముందో, ఏం కాగలదో చెప్పగలిగే సత్తా తనకుందని, కానీ మూడు నెలలకే ఎవరిపై విమర్శ చేయకూడదనే ఉద్దేశంతో తాను ఏమీ మాట్లాడలేదన్నారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఏ నాయకుడిపై కానీ, ఏ పార్టీపై కానీ వ్యక్తిగత దూషణలు చేయలేదన్నారు. తనకు ఆ సంస్కారం ఉందని ఈటల ఘాటుగా స్పందించారు. పొలిటికల్ లీడర్ ఉన్నతంగా ఉండాలని, సంకుచితంగా ఉండేవాడు పొలిటికల్ లీడర్ కాదని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పొలిటికల్ లీడర్ సంకుచితవాది, డైరెక్షన్ లేని వాళ్ళు అయితే వ్యవస్థ కూలిపోతుందని తాను నమ్ముతానన్నారు. అలాంటి చిన్న, కురుస నాయకుల గురించి తాను మాట్లాడనని ఈటల ఫైరయ్యారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి రాసుకున్నోడికి తెలియదని, విన్న వారికి కూడా తెలుసుకునే ఆస్కారం లేకుండా పోయిందన్నారు. ఇచ్చిన హామీలు అమలై ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నానని ఈటల రాజేందర్ కోరారు.



## తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నాం: డీకే అరుణ

హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం) తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో 33 శాతం రిజర్వేషన్‌తో మహిళలకు రాజకీయాల్లో సముచిత స్థానం రాబోతుందని తెలిపారు.హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మహిళా మోర్చా కార్యాచరణను వివరించారు. రామరాజ్య స్థాపనలో ముందడుగు వేసిన మోదీకి మహిళలంతా అండగా నిలవాలని కోరారు.




2

## కాంగ్రెస్‌లో కోల్డ్ వార్

భట్టి విక్రమార్కపై వీహెచ్ సంచలన ఆరోపణలు

## అభివృద్ధిని ఇండియా కూటమి ఓర్వలేదు



న్యూఢిల్లీ, మార్చి 10 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌లో రూ.42 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'అజంగఢ్‌లో గతంలో మాఫియా పాలన ఉండేదని, ఇప్పుడు ఇక్కడి ప్రజలు చట్టబద్ధమైన పాలనను చూస్తున్నారని పేర్కొన్నారు. దీంతో 'ఇండియా కూటమి'కి నిద్రపట్టడంలేదని ప్రధాని మోదీ విమర్శించారు. అజంగఢ్ అభివృద్ధికి బాటలు వేస్తుందని, నక్షత్రంలా వెలిగిపోతుందని మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నేతలు కేవలం పథకాలను మాత్రమే ప్రకటించేవారని విమర్శించారు. మోదీ కింది స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి అని, దేశాభివృద్ధే లక్ష్యంగా తన ప్రయాణం సాతున్నదని అన్నారు. అజంగఢ్ అభివృద్ధికి చిహ్నంగా మారుతుందని మోదీ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రజల కళ్లలో దుమ్ము కొట్టిందని ఆరోపించారు. తాము దేశంలో అనేక రైల్వే స్టేషన్లు ఏకకాలంలో నిర్మిస్తున్నామన్నారు. దేశం మొత్తం మీద అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఇక్కడ నుండే ప్రారంభమవుతున్నాయని, ఈరోజు దాదాపు రూ.34 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను అజంగఢ్ నుంచి ప్రారంభించామన్నారు. నేడు ఆజంగఢ్ కొత్త చరిత్ర నాందిపలుకుతోందని అన్నారు. కులతత్వం, బంధుప్రీతి, ఓటు బ్యాంకుపై ఆధారపడిన ఇండియా కూటమి ఇంతటి అభివృద్ధిని జీర్ణించుకోలేక పోతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోపాటు పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ.. అజంగఢ్, పూర్వాంచల్ ప్రజలకు రాజా సుహెల్‌దేవ్ స్టేట్ యూనివర్శిటీ, మందూరి విమానాశ్రయంతో సహా అనేక ప్రాజెక్టులను కానుకగా ఇచ్చారు.

## ఓడితే మగాడు కాదా?

### సీఎం రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

కామారెడ్డి, మార్చి 10 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా చిల్లర మాటలు మాని.. హుందాగా ప్రవర్తించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన సవాల్ కు స్పందించి మల్కాజిగిరిలో గెలిచి దమ్మేంటో నిరూపించుకోవాలని ఛాలెంజ్ చేశారు. ఆదివారం కామారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల

..మిగతా 2లో





2

## నీట్ యూజీ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

25 లక్షలు దాటిన దరఖాస్తులు


## బీఆర్ఎస్ .. బీఎస్పీ పొత్తు ఖరారు



హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు మొదటి జాబితాలో భాగంగా అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సారి ఎన్నికల్లో పొత్తులు కీలక కానుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. కాంగ్రెస్ పార్టీ సీపీఐతో గత ఎన్నికల మాదిరిగానే పొత్తు పెట్టుకుంటుండగా, బీఆర్ఎస్ బీఎస్పీతో జతకడుతోంది. ఈ నేపథ్యంలో

..మిగతా 2లో

# కాంగ్రెస్‌తో చెలిమి దిశగా మజ్లిస్ అడుగులు




## పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందుజాగ్రత్తలు

## హైదరాబాద్ పార్లమెంటరీ స్థానం తమదేనని ధీమా

## అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ డమ్మీల కోసం ఎంఐఎం పావులు

హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పాతబస్తీ రాజకీయం రసవత్తరంగా మారనున్నదా... సరికొత్త ఎత్తులు, పొత్తులకు రంగం సిద్ధమవుతున్నదా... కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ స్నేహహస్తం అందించనున్నదా.. మెట్రోరైలు పనుల శంకుస్థాపన వేదిక సరికొత్త రాజకీయ పరిణామాలకు అంకురార్పణ చేసిందా... అంటే అవుననే అంటున్నాయి తాజా రాజకీయ పరిణామాలు. ఇటీవల పాతబస్తీలో మెట్రో రైలు పనుల శంకుస్థాపన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు ఊతమిస్తున్నాయి. ఇవి ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఓటమి ఎరుగని మజ్లిస్ పార్టీ ఈసారీ నూటికి నూరు శాతం విజయం సాధిస్తాననే ధీమాతో ఉన్నప్పటికీ ఇటు బీజేపీని, అటు ఎంబీటీనీ ఎదుర్కోవడానికి ఎత్తుగడలను మారుస్తోంది. విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్ మాధవీలతను బీజేపీ అధిష్టానం హైదరాబాద్ నుంచి ఎన్నికల బరిలో దింపుతుండటంతో మజ్లిస్ పార్టీ అప్రమత్తమైంది. దీనికి శుక్రవారం పాతబస్తీ ఫలక్‌నుమాలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న మెట్రో రైలు పనుల శంకుస్థాపన సభలో ఎంఐఎం సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యవహరించిన తీరే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీతో కొన్నేళ్లుగా ఎడమొహం పెడమొహంగా ఉన్న అసదుద్దీన్ దోస్తానా కోసం స్వరం మార్చారు. ఆయన తాజా బహిరంగ సభలో మాట్లాడుతూ 'సీఎం రేవంత్‌రెడ్డి మొండి ఘటం. ఆ మొండితనమే ఆయనను సీఎం పదవి వరకు తెచ్చింది. అయితే నేను, నా పార్టీవాళ్లు కూడా తలతిక్కోళ్లం. అయినప్పటికీ ఐదేళ్లపాటు హాయిగా ప్రభుత్వాన్ని నడిపేటట్లు పూర్తిగా సహకరిస్తాం' అని ప్రకటించడం గమనార్హం. అసద్ మాటలపై సీఎం రేవంత్ స్పందిస్తూ 'మజ్లిస్ పార్టీని ఓడించడానికి నేను కూడా ప్రయత్నించా. కానీ, వీలు కాలేదు. ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఆ తర్వాత అభివృద్ధిపైనే దృష్టి సారిస్తా' అని పేర్కొంటూ పరోక్షంగా స్నేహహస్తం అందించారు. ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి దగ్గరైతే హైదరాబాద్ పార్లమెంటరీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున డమ్మీ అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దించేటట్లు పావులు కదుపుతుందా..? అదే నిజమైతే మరి బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఏమిటని చర్చ పాతబస్తీలో జోరుగా జరుగుతోంది. బీఆర్ఎస్‌తో కూడా దోస్తానా కొనసాగించి హైదరాబాద్ వరకు తమకు అనుకూలంగా ఉండే అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దించేటట్లు చేస్తుందొచ్చని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి డమ్మీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగితే తమకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని మజ్లిస్ పార్టీ భావిస్తోంది. హైదరాబాద్ పార్లమెంటరీ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్న మజ్లిస్ బాచావో తెహ్రీఖ్(ఎంబీటీ) పార్టీ కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తుందని గంపెడాశతో ఉంది. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పొందినా, మజ్లిస్ పార్టీకి చుక్కలు చూపించిన ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ఈసారి హైదరాబాద్ పార్లమెంటరీ స్థానంపై కన్నేశారు. స్థానిక ప్రజాసమస్యలను తెలుసుకుని ప్రజలకు దగ్గరవుతున్నారు. అటు ఎంబీటీతోపాటు ఇటు బీజేపీ అభ్యర్థిని ఎన్నికల బరిలో ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ పార్టీకి దగ్గరవడమే రాజకీయంగా కలిసి వస్తుందని భావించిన మజ్లిస్ పార్టీ ఆ దిశగా ముందుకెళుతూ తన ఎన్నికల వ్యూహాన్ని మార్చినట్లు కనిపిస్తోంది.

# కాంగ్రెస్‌లో కోల్డ్ వార్..

## భట్టి విక్రమార్కపై వీహెచ్ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, మార్చి 10 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై సీనియర్ నేత హన్మంతరావు సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరుగుతుందోని వీహెచ్ వ్యాఖ్యలు చేశారు. కాగా, వీహెచ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..'భట్టి విక్రమార్క నాకు ఖమ్మం లోక్‌సభ సీటు రాకుండా చేస్తున్నారు. భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు. సీటు రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో నాకు తెలియడం లేదు. మొదట సీటు ఇస్తా అన్నారు.. ఇప్పుడు నన్ను పట్టించుకోవడం లేదు. ఈరోజు భట్టి పార్టీలో ఆ స్థానంలో ఉన్నాడంటే అందుకు నేనే కారణం. భట్టిని ఎమ్మెల్సీని చేసింది నేనే. నా కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లో లేరు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాకు న్యాయం చేయాలి. నేను లోకల్ కాదు అంటున్నారు. రేణుకా చౌదరి, నాదెండ్ల భాస్కర్, రంగయ్య నాయుడు లోకలా?. పార్టీ కోసం పదవులు ఆశించకుండా పనిచేసిన నాకు న్యాయం చేయండి. ఖమ్మం లోక్‌సభ సీటు నాకు కేటాయిస్తే ఖచ్చితంగా గెలుస్తాను. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు అన్యాయం జరుగుతోంది. బీసీల ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదా?. బీసీలు కేవలం ఓట్లు వేసే మిషన్లు మాత్రమేనా?. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర, కుల గణన అంటున్నారు. రాహుల్ అయినా నాకు న్యాయం చేయాలి. ఖమ్మం నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తే నేను తప్పుకుంటాను. లేకపోతే ఖమ్మం నుంచి పోటీకి నేనే అర్హుడిని. నేను పార్టీ కోసం పనిచేశాను. నేను చనిపోయే వరకు పార్టీలోనే ఉంటాను. చనిపోయిన తరువాత పార్టీ జెండా నాపై ఉంటుంది. నేను పార్టీ మారే వ్యక్తిని కాదు. నేను పార్టీలో ఎందరికో సహాయం చేశాను. నా వయసు నాకు అడ్డంకి కాదు' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## లోక్‌సభ బరిలో మాజీ క్రికెటర్

# యూసఫ్ పఠాన్



న్యూఢిల్లీ, మార్చి 10 (ప్రభాత ఉదయం): గత కొన్నాళ్లుగా సినీ తారలు ఓ వెలుగు వెలిగిన పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఇప్పుడు క్రికెటర్ల ఆట మొదలైంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లోని బెహ్రాంపూర్ నియోజకవర్గం నుంచి టీఎంసీ పార్టీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌కు టికెట్ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో మొహమ్మద్ షమీని ఎన్నికల బరిలోకి దింపాలని బీజేపీ యోచిస్తోందని మీడియాలో పుకార్లు షికార్లు వినిపిస్తున్నాయి. దీని ప్రకారం బెంగాల్‌లోని బసిర్‌హత్ నియోజకవర్గం నుంచి మహ్మద్ షమీని బీజేపీ బరిలోకి దించబోతోందని చెబుతున్నారు. మహ్మద్ షమీని బీజేపీ నేతలు కలిసిన పరిణామమే ఇందుకు దారితీసింది. లోక్‌సభ ఎన్నికల్లో షమీని బరిలోకి దింపాలనే ఆలోచన బీజేపీలో ఉందని, అందుకే షమీ అలాంటి ప్రతిపాదనను ముందుకు తెచ్చారని చెబుతున్నారు. అయితే, ఈ రూమర్ ప్రకారం మహ్మద్ షమీ బీజేపీలో చేరడం లేదా ఎన్నికల్లో పోటీ చేయడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గాయం కారణంగా ప్రస్తుతం క్రికెట్‌కు స్వల్ప విరామం తీసుకున్న మహ్మద్ షమీ ఇటీవల వన్డే ప్రపంచకప్‌లో ఆడాడు. ఈ ప్రపంచకప్‌లో షమీ బౌలింగ్ హైలైట్‌గా నిలిచింది. భారత్ ఫైనల్ చేరడానికి షమీ కూడా ప్రధాన కారణం. ప్రధాని నరేంద్ర మోదీ భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లి ఆటగాళ్లను అభినందించారు. ఈసారి మహ్మద్ షమీని మోదీ హగ్ చేసుకున్న వీడియో మీడియాలో వైరల్‌గా మారింది. మహ్మద్ షమీ ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. షమీ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. ఈ పరిణామాలన్నీ మహ్మద్ షమీ బీజేపీలో చేరవచ్చన్న ప్రచారానికి బలం చేకూర్చాయి. షమీ బరిలోకి దిగుతారని భావిస్తున్న బషీర్‌హత్ నియోజకవర్గం నుంచి టీఎంసీ పార్టీ హాజీ నూరుల్ ఇస్లాంను పోటీకి దింపింది. ఒకవేళ షమీ నిజంగానే బీజేపీ నుంచి పోటీ చేస్తే, ఈ టీఎంసీ కంచుకోటలో ఆయన ఎంతమేరకు సత్తా చాటుతారనేది ఆసక్తికరంగా మారింది. టీఎంసీ పార్టీ బెహ్రాంపూర్ నుంచి యూసుఫ్ పఠాన్‌ను బరిలోకి దింపింది. బర్ధమాన్ దుర్గాపూర్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్‌కు టికెట్ లభించింది. శత్రుఘ్న సిన్హా, హాజీ నూరుల్ ఇస్లాం, అభిషేక్ బెనర్జీ, ప్రసూన్ బెనర్జీ, ప్రతిమా మోండల్, సుదీప్ బందోపాధ్యాయ, మహువా మొయిత్రా, షానవాజ్ అలీ రిజ్వాన్ వంటి ముఖ్యులకు టిఎంసి పార్టీ టిక్కెట్లు ఇచ్చింది.



# 'ఓడితే మగాడు కాదా?'

మొదటి పేజీ తరువాయి...

విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. 'ఎన్నికల్లో గెలిస్తే మగాడు. ఓడితే కాదా.?. నా సవాల్ ను రేవంత్ రెడ్డి ఎందుకు స్వీకరించడం లేదు. మల్కాజిగిరిలో ఇద్దరం పోటీ చేద్దాం. ఎవరు మగాడో తేల్చుకుందాం. మా అయ్య పేరు కేసీఆర్. నేను ఉద్యమం చేసి రాజకీయాల్లోకి వచ్చాను. అంతేకానీ రేవంత్ రెడ్డిలాగా రాంగ్ రూట్ లో రాలేదు.' అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ నెల 17 వరకూ ఓపిక పడతామని.. కాంగ్రెస్ వంద రోజుల పాలన పూర్తయ్యాక ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం చేశారు. 'మేడిగడ్డలో 85 పిల్లర్లు ఉంటే.. అందులో మూడు కుంగిన మాట వాస్తవమే. అంతే కానీ కాళేశ్వరం, మేడిగడ్డ కుంగిపోలేదు. 3 నెలల్లో ఆ పిల్లర్లను బాగు చేయలేరా.?. అసంబద్ధమైన హామీలు ఇచ్చి కామారెడ్డిలో కేసీఆర్ ను ఓడించారు. గొర్రె కసాయిని నమ్మినట్లు ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణమాఫీ చేయాలి. వంద రోజులు పూర్తయ్యాక ఆడబిడ్డలు కాంగ్రెస్ భరతం పడతారు.' అని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో అందరూ కష్టపడి పని చేశారని.. ఎవరినీ తప్పు పట్టలేమని కేటీఆర్ అన్నారు. 'మబ్బుల వెనక్కి పోతేనే సూర్యుడి విలువ తెలుస్తుంది. మనం కూడా కొద్ది రోజుల్లో మళ్లీ వెలుగులోకి వస్తాం. కరీంనగర్ లో ఎండిన పొలాలు పరిశీలించినప్పుడు రైతులు బాధ పడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో తొలిసారి మళ్లీ అర్ధరాత్రి పొలం వద్దకు పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. సామాన్య ప్రజలు, రైతులు, మహిళల్లో మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నాం అనే బాధ ఉంది. జరిగిందేదో జరిగింది మనస్సులోంచి తీసేయండి. అందరూ గట్టిగానే కష్టపడి నిలబడ్డారు. నిజం గడపదాటేలోగా అబద్ధం ఊరంతా తిరిగొస్తుందని పెద్దలు ముందే చెప్పారు. నిజాయితీ గల మోసగాడు రేవంత్ రెడ్డి.' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆడపిల్లల వివాహాలకు తులం బంగారం ఇస్తామని రేవంత్ ఎన్నికల టైంలో చెప్పారని.. 3 నెలలవుతున్నా ఇంత వరకూ ఆ ఊసే లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇప్పటికీ కేసీఆర్ అమలు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. 'వంద రోజులు పూర్తైన తర్వాత కాంగ్రెస్ పార్టీకి బొంద తవ్వేది ఆడబిడ్డలే. మహాలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైంది.?. రైతులకు క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తా అన్నారు. ఇప్పుడు యాసంగి పంట కోతకు వస్తుంది. సీఎం రేవంత్ కు చిత్తశుద్ధి, రైతుల మీద ప్రేమ ఉంటే ఎన్నికల కోడ్ వచ్చే లోపు బోనస్ ప్రకటించాలి.' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నీట్ యూజీ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

## 25 లక్షలు దాటిన దరఖాస్తులు!

న్యూఢిల్లీ, మార్చి 10: దేశవ్యాప్తంగా ఉన్న పలు మెడికల్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) యూజీ 2024 పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు మార్చి 9వ తేదీ రాత్రి 9 గంటలతో ముగిసింది. కొందరు అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ తుది గడువును మార్చి 16వ తేదీ వరకు పొడిగించింది. దీంతో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం లభించినట్లైంది. కాగా మే 5న నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించనున్నట్టు ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. నీట్ యూజీలో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షను దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఇంగ్లిష్, హిందీ, తెలుగుతో పాటు మొత్తం 13 భాషల్లో ఆఫ్‌లైన్ (పెన్ను, పేపర్) విధానంలో నిర్వహించనున్నారు. 200 నిమిషాల వ్యవధిలో పరీక్ష రాయవల్సి ఉంటుంది. మార్చి 16న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 నిమిషాల వరకు పరీక్ష ఉంటుంది. ఇక ఫలితాలు జూన్ 14న ప్రకటిస్తారు. నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ యూజీ) 2024కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బయోటెక్నాలజీతో సైన్స్‌లో ఇంటర్మీడియట్ లేదాప్రీ-డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి తప్పని సరిగా 17 ఏళ్లకు మించి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో మార్చి 16, 2024 రాత్రి 10.50 నిమిషాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే రోజు రాత్రి 11.50 నిమిషాల వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు. దరఖాస్తు సమయంలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.1700, జనరల్ ఈడబ్ల్యూఎస్/ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులు రూ.1600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, థర్డ్ జండర్ అభ్యర్థులు రూ.100 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విదేశాలకు చెందిన అభ్యర్థులు రఖాస్తు రుసుం కింద రూ.9500లు చెల్లించాలి. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ తేదీ, పరీక్ష కేంద్రాలకు సంబంధించిన వివరాలను ఎన్‌టీఏ త్వరలో వెబ్‌సైట్‌లో వెల్లడించనుంది.

## బీఆర్ఎస్.. బీఎస్పీ

# పొత్తు ఖరారు

మొదటి పేజీ తరువాయి...

ఈ ఇరు పార్టీల కలయిక హాట్ టాపిక్ గా మారింది. పొత్తు ఉంటుందా? లేదా అనే విషయమై బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరోసారి క్లారిటీ ఇచ్చేశారు. తెలంగాణలో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి అనుమతి లభించిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని ప్రకటించారు. బీఎస్పీ-బీఆర్ఎస్ పార్టీల కూటమి చర్చలపై రాష్ట్రంలో ఏర్పడిన సందిగ్ధానికి బెహన్జీ మాయావతి కొద్ది సేపటి క్రితమే తెరదించారని ఆయన వివరించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఎన్డీయే, ఇండియా కూటమిలో లేనందున ఆ పార్టీతో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ హై కమాండ్ అనుమతించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు వివరించారు. బీఎస్పీ, బీఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేసే స్థానాలపై త్వరలోనే సంయుక్త ప్రకటన ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగే తదుపరి చర్చలకు పార్టీ రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ బెహన్జీ దూతగా హాజరుకానున్నారని తెలిపారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులపై మీడియాలో వస్తున్న నిరాధారమైన , వదంతులు ,దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మవద్దని ఆర్ఎస్ ర్విక్వెస్ట్ చేశారు.

# నీట్ యూజీ 2024 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 10 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ పరీక్షకు సంబంధించిన రిజిస్ట్రేషన్ గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పొడిగించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మార్చి 9తో గడువు ముగియాల్సి ఉండగా.. చివరినిమిషంలో సర్వర్ సమస్యల కారణంగా చాలా మంది ఇబ్బందులు పడ్డారు.. దీంతో మార్చి 16 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మార్చి 16న రాత్రి 10.50 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత్రి 11.50 గంటల వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేనివారు వెంటనే చేసుకోవచ్చు. ఈ ఏడాది నీట్ యూజీ నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫిబ్రవరి 9న విడుదల చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థుల నుంచి ఫిబ్రవరి 9 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. నీట్ యూజీ పరీక్షను మే 5న నిర్వహించనున్నట్లు ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. ఇంగ్లిష్, హిందీ, తెలుగుతో పాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్షను పెన్ను, పేపర్ విధానంలో నిర్వహించనున్నారు. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్, పరీక్ష కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో వెల్లడించనున్నారు. నీట్ పరీక్ష మే 5న (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల మధ్య జరగనుంది. నీట్(యూజీ) సిలబస్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తగ్గించిన సంగతి తెలిసిందే. విద్యార్థులపై భారం తగ్గించే విధంగా సిలబస్‌లో మార్పులు చేసింది. ఎన్ఎంసీ విడుదల చేసిన సిలబస్ ప్రకారం.. ఫిజిక్స్‌లో అధికంగా సిలబస్ తగ్గించారు. కెమిస్ట్రీలోనూ కొన్ని పాఠ్యాంశాలను తగ్గించారు. అయితే బోటనీ, జువాలజీ సబ్జెక్టుల సిలబస్ తగ్గించడం విద్యార్థుల ప్రిపరేషన్‌పై పెద్ద ప్రభావమేమీ చూపదని నిపుణులు అంటున్నారు. ఇది విద్యార్థులకు అనుకూలించే అంశమని చెప్పవచ్చు. అయితే సిలబస్‌ను ఆలస్యంగా విడుదల చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అని నిపుణులు అంటున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్, ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గత ఐదేళ్లుగా ఈ పరీక్ష రాసేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. గతేడాది మొత్తం 20.38 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 11.45,968 మంది విద్యార్థులు అర్హత సాధించారు.

# మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసిన 317 జీవో బాధితులు

## షరిష్కారం చూపిస్తామని హామీ

హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన 317 జీవో ద్వారా ఇబ్బందులు ఎదుర్కుంటున్న బాధితులు తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసానికి ఆదివారం వెళ్లిన 317 జీవో బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 317 జీవో బాధితులు మంత్రి దామోదర్ రాజనర్సింహాకి తమ సమస్యల పరిష్కారం కోసం ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయాలతో ఉద్యోగుల స్థానికతను గుర్తించకుండా, జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం అడుకున్నారని మంత్రికి వివరించారు. గత ప్రభుత్వం నిరంకుశ పాలన, అస్తవ్యస్త విధానాలతో ఉద్యోగులను, కుటుంబాలను అనేక ఇబ్బందులకు గురిచేశారని మంత్రి రాజనర్సింహాకి బాధితులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం 317 జీవో పై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహని కలిసిన బాధితులు.. తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 317 జీవో బాధితులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతి పత్రాన్ని సమర్పించారు. తమకు న్యాయం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. తమ స్థానికత, పదోన్నతులు, బదిలీలు, స్పౌజ్ కేసుల సమస్యల పరిష్కారానికి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలపై లోతుగా చర్చిస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి భరోసానిచ్చారు. ఉద్యోగులు, 317 జీవో బాధితులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. క్యాబినెట్ సబ్ కమిటీ లో అధ్యయనం చేసి న్యాయం చేస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నేతృత్వం లో పునర్ సమీక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తుందన్నారు.

# ఆస్ట్రేలియాలో హైదరాబాద్ మహిళ దారుణ హత్య

## రోడ్డు పక్కన చెత్త డబ్బాలో మృతదేహం

విక్టోరియా, మార్చి 10 (ప్రభాత ఉదయం): హైదరాబాద్‌కు చెందిన ఓ మహిల ఆస్ట్రేలియాలో దారుణ హత్యకు గురైంది. ఆమె మృతదేహాన్ని బక్లీలోని రోడ్డు పక్కన గల ఓ చెత్త డబ్బాలో అక్కడి పోలీసులు గుర్తించారు. అయితే భర్తే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆస్ట్రేలియాలో తెలుగు వైద్యురాలి మృతి ఘటన మరువక ముందే మరో తీవ్ర విషాదం నెలకొంది. తాజాగా మరో మహిళ దారుణ హత్యకు గురైంది. ఆస్ట్రేలియాలోని బక్లీలో తెలంగాణకు చెందిన చైతన్య మాధగాని అలియాస్ శ్వేత దారుణ హత్యకు గురైంది. ఆమె మృతదేహం రోడ్డు పక్కనే ఉన్న ఓ చెత్త డబ్బాలో పోలీసులు గుర్తించారు. ఆస్ట్రేలియా మిర్కావే పాయింట్ కుక్‌లో భర్త అశోక్ రాజ్ వరికుప్పలతో కలిసి శ్వేత నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె చెత్త డబ్బాలో శవమై కనిపించింది. శ్వేత మృతిపై కేసు నమోదు చేసుకున్న విక్టోరియా పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఈ కేసులో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మ్నొదట ఎవరో హత్య చేసి ఉంటారని భావించగా.. భర్తే ఆ దారుణానికి ఒడిగిట్టినట్లు తెలిసింది. భార్యను హత్య చేసిన అశోక్ రాజ్ మృతదేహాన్ని చెత్తడబ్బాలో దాచి పెట్టాడు. అనంతరం కుమారుడితో కలిసి హైదరాబాద్ చేరుకున్న అతడు కొడును ఏఎస్ రావు నగర్‌లోని అత్తగారి ఇంట్లో వదిలాడు. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకున్న విక్టోరియా పోలీసులు విచారణ చేపట్టారు. శ్వేత మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు బంధువులు ప్రయత్నాలు మ్నొదలు పెట్టారు. రెండ్రోజుల క్రితం ఓ తెలుగు వైద్యురాలు ఆస్ట్రేలియాలో కన్నుమూశారు. స్నేహితులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు ట్రెక్కింగ్‌కు వెళ్లిన తెలుగు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. కృష్ణా జిల్లాకు చెందిన వేమూరు ఉజ్వల ఆస్ట్రేలియా గోల్డ్‌కోస్ట్‌లోని బాండ్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆమె ఆస్ట్రేలియాలోని రాయల్ బ్రిస్బేన్ ఉమెన్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు. ఈనెల 2న సరదాగా తోటి స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఉజ్వల ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడి మరణించింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో ఆమె చనిపోగా.. తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



# మోడీ మూడోసారి ప్రధాని కావాలని దేశమంతా కోరుతోంది..

## చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డిని గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీకి ఎంపి సీటును బహుమతిగా ఇస్తాం..



రథయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న బిజెపి సీనియర్ నాయకులు టి అంజన్ కుమార్

రాజేంద్రనగర్,మార్చి10(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ లో ఎన్నికల హడావిడి షురూవైంది.నోటిఫికేషన్ రాకముందే బిజెపి ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అయ్యింది.చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించి బిజెపి ముందు వరుసలో ఉంది. మరో అడుగు ముందుకేసి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వరరెడ్డి తరపున బండ్లగూడ ఆర మైసమ్మ దేవాలయంలో ఆదివారం పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రచార రథానికి పూజలు చేశారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ...చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డిని గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీకి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావాలని అన్ని వర్గాలు,ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.సర్వేలన్ని కూడా మోడీకి అనుకూలంగా ఉన్నాయని, ఇతరులెవరూ ఆయన దరిదాపుల్లో లేరని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.దేశమంతటా మరోసారి మోడీ ప్రధాని కావాలని ఎక్కడ చూసినా చర్చ జరుగుతోందన్నారు.దేశాన్ని అనేక మంది పరిపాలించారని ప్రతీ ఒక్కరి మీద ఏదో ఒక అవినీతి మరక ఉ ందని,కానీ పదేళ్లుగా నరేంద్ర మోడీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు.ప్రజలు స్థిరమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు.దేశంలో ఉగ్రవాదం,మతకల్లోలాను మోడీ అరికట్టారని పేర్కొన్నారు.దేశాన్ని అనేక మంది పరిపాలించారని, ప్రతి ఒక్కరి మీద ఏదో ఒక్క అవినీతి మరక ఉ ందన్నారు.పదేళ్లుగా నరేంద్ర మోడీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదన్నారు.కాంగ్రెస్ ఫ్రంట్ ల పేరుతో మోడీని దించాలని కుట్ర చేస్తున్నారన్నారని,దీనిని ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు.చేవెళ్లే పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ మోషపూరితమైన వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,మల్లేష్ యాదవ్,మహేష్ యాదవ్,అంజన్ కుమార్,మహాలింగం,కొండా గౌతమిరెడ్డి,కొండా అపర్ణారెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## క్యాలెండర్ ఆవిష్కరణ

బుద్వేల్, మార్చి10(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వర్సిటీ ఎస్సీ ఎస్టీ టీచింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు రూపొందించిన 2024 క్యాలెండర్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు పలు సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చి ఉద్యోగుల సమస్యలన్నీటిని తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ , ఎస్టీ టీచింగ్, నాట్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు జి పరమేశం , అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్ జయరాం, కార్య నిర్వాహణ కార్యదర్శి సి అరుణ్ కుమార్, కోశాధికారి ఎస్ నర్సింగరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. గోవర్ధన్, డాక్టర్ బీవీ వరప్రసాద్, డాక్టర్ రమేష్, డాక్టర్ జి.సత్యనారాయణ, కె. బాల నరసింహ , డాక్టర్ శ్రావణ్ కుమార్ , డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ కేబి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఎం భుజంగం రెడ్డి, ఎండి సాజిద్‌చే జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేపిస్తున్న బుద్వేల్ నాయకులు

## ఘనంగా ఈటీవీ రిపోర్టర్ భుజంగ రెడ్డి, స్థానిక ఎండి సాజిద్ ల జన్మదిన వేడుకలు

### ఇరువురికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బుద్వేల్ నాయకులు


రాజేంద్రనగర్, మార్చి10(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గం ఈటీవీ రిపోర్టర్ మిద్దెల భుజంగ రెడ్డి, బుద్వేల్ కు చెందిన ఎండి సాజిద్ ల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో స్థానిక నాయకులు కే శ్రీనివాస్ గౌడ్, ఎస్ కె నజీర్, జి హరి కిరణ్ గౌడ్ ,మూల రమేష్ గౌడ్, కే శేఖర్ రెడ్డి, ఎండి వాజిద్, గాలి వెంకటేష్, ఇబ్రహీం ఖాన్, శంకర్ చారి, మూల సంతోష్ గౌడ్, జి రవి కిరణ్ గౌడ్, రత్నాచారి ,నరేష్ గౌడ్, మూల నిరంజన్ గౌడ్, సాగర్, వెంకటేష్, శివ కుమార్ యాదవ్, డి ఎస్ వెంకటేష్ లు భుజంగారెడ్డి ,సాదిక్ ల చేత కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న స్నేహ మహిళా పొదుపు సంఘం సభ్యులు

## స్నేహ పొదుపు సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు

బుద్వేల్, మార్చి10(ప్రభాత ఉదయం) : రాచంద్రా నగర్ దళిత బస్తీకి చెందిన స్నేహ పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు పొదుపు సంఘం మహిళలు తమ పొదుపులు గురించి చర్చించుకున్న అనంతరం సన్మానించుకున్నారు ఈ కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షురాలు ఏ కళాశాల ఉపాధ్యక్షురాలు ఏ ఝాన్సీ మేఘన పద్మ రాణి యాదమ్మ నాగమ్మ స్వరూప, విజయలక్ష్మి, లక్ష్మీ, అమృత తదితరులు పాల్గొన్నారు.



మొంద్ర నర్సింహను సన్మానిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

## మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

బుద్వేల్, మార్చి10(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయం లో మూడు రోజులపాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు ఎం. నర్సింహ ను కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు . చిన్న అనంతగిరి శివాలయంలో సమావేశమైన. ప్రణవభక్త సమాజం సభ్యులు కమిటీకి నాయకత్వం వహించి అందరిని కలుపుకొని పోయి శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా జరిపించిన ఎం. నరసింహ అభినందనీయుడన్నారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ, పండుగ అంటే. మూడు రోజులే కాదని, ఒక నెల రోజులుగా కమిటీ సభ్యులు అందరూ ఎంతో కష్టపడి మహాశివరాత్రి వేడుకలను విజయవంతం కావడానికి సహకరించారని గుర్తు చేశారు. వాళ్ళందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, సన్నివెల్లి కృష్ణ, కొండమీది హరినాథ్, గండయ్య , ఎస్ బీ హరనాథ్, నారగూడెం మల్లారెడ్డి , కొలన్ సుభాష్ రెడ్డి , మ్యాడం రామేశ్వరరావు , మ్యాడం మధుసూదన్ , ఎం. కొమురయ్య , ఎం. ఐలయ్య, కాడెం సుధాకర్ , షాబాధ విజయకుమార్ , తుల్జా గారి శ్రీరాములు , సోమారం సురేష్, సులిగే అశోక్ , తాటి రాజు, ఎల్ వెంకటేష్ , కాకులారం కృష్ణ, రావుల జగన్ , మ్యాడం రాము , ఎం బాలసుబ్రమణ్యం, కిరణ్ చారి, ఆర్య తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రుద్ర కుమార్

## మహిళలకు తొలి విద్య నేర్పిన సావిత్రిబాయి పూలే: సిఐటియు జిల్లా కార్యదర్శి రుద్ర కుమార్

రాజేంద్రనగర్, మార్చి10(ప్రభాత ఉదయం) మహిళలకు తొలి విద్య నేర్పిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ కొనియాడారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ మాట్లాడుతూ.. తొలితరం మానవాళికి సామాజిక విప్లవ మూర్తి అన్నారు. పాఠశాలలలో బడుగు బలహీన వర్గాలలో మాతృమూర్తి సావిత్రిబాయి పూలే విగ్రహాలు ప్రతి స్కూలు కళాశాలలో గ్రామాలలో బస్తీర్లలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె త్యాగం మనం గుర్తు చేసుకుంటూ సిఐటియు ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించుకోవడం కోసం మీరందరూ ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాజేంద్రనగర్ మండల నాయకులు ప్రవీణ్ కుమార్ ,సచిన్ ,టి వెంకటేష్ గౌడ్ ,దత్తు, శశికాంత్, జాంగిర్, నరేందర్,రాజేష్, వెంకట్రావు,ఎండి మహమూద్ తదితరులు పాల్గొన్నారు



ఐ బి ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

## రంజాన్ పవిత్ర మాసాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

బుద్వేల్, మార్చి10(ప్రభాత ఉదయం): రంజాన్ పవిత్ర మాసాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కోరుతూ ఆదివారం రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన శాంతి కమిటీ సమావేశాలలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ , రాజేంద్రనగర్ ఏసీపీ టి శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ లు బి నాగేంద్రబాబు , వెంకట్రాంరెడ్డి, పి మధు లు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ, రంజాన్ పవిత్ర మాసాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. రౌడీ షీటర్ లపై నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా గొడవలకు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రౌడీలు దౌర్జన్యాలు చేసేవారి పట్ల నిఘా ఏర్పాటు చేశామని ఎవరైనా గొడవలకు పాల్పడితే వారిపై ఉక్కు పాదం మోపుతామన్నారు.



సూచనలు చేస్తున్న పోలీసులు

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో సావిత్రీ బాయి పూలే వర్ధంతి



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పెంద్యాల సాయి మల్లిక్, కరణం రఘు ముదిరాజ్



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు కోరని బాల్ రాజ్, బీఎస్పీ నాయకులు ఆదిరాల రవికుమార్

బుద్వేల్, మార్చి10(ప్రభాత ఉదయం) : మహిళాభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. స్త్రీ కి విద్య అవసరమని ఎన్నో అవరోధాలు ఎదురైనా స్త్రీలకు చదువు చెప్పడానికి వెనుకాడని ధైర్య శాలి సావిత్రిబాయి పూలే అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె. కృష్ణమాచారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు కె. రఘు గౌడ్, అడికె అర్జున్, ఆదిరాల రవికుమార్, పెంద్యాల సాయి మల్లిక్, ఎం బాలసుబ్రమణ్యం, యు శ్రీకాంత్, కోరని బాల్ రాజ్, కొలమీది యాదయ్య ముదిరాజ్ , కరణం నారాయణ ముదిరాజ్, కె. రఘు ముదిరాజ్, డి సత్యనారాయణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు



నివాళులు అర్పిస్తున్న కె. కృష్ణమా చారి, కె. రఘు గౌడ్, ఆడికె అర్జున్ తదితరులు

# 'ధరణి' పరిష్కారం 'పేపర్‌పైనే'!

**పెండింగ్ దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్‌లో కొత్త ట్విస్ట్**

**76 వేలకుపైగా దరఖాస్తులను పరిష్కరించామన్న ప్రభుత్వం**

**ఆన్‌లైన్‌లో మాత్రం అప్‌డేట్ కాని వివరాలు**

**అదీకృత లాగిన్‌లు ఇవ్వని పోర్టల్ నిర్వహణ కంపెనీ**

**ప్రస్తుతం కలెక్టర్ల చేతిలో మాత్రమే అప్‌డేట్ చేసే అవకాశం..**



హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం) ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ భూముల సమస్యలకు పరిష్కారం కాగితాలకే పరిమితం అవుతోంది. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌లో 76 వేలకుపైగా దరఖాస్తులను పరిష్కరించినట్టు ప్రభుత్వం చెప్తున్నా.. ఆ వివరాలేవీ పోర్టల్‌లో అప్‌డేట్ కాలేదు. అంతేకాదు పోర్టల్‌లోని సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ పెట్టుకున్న గడువు కూడా ముగిసింది. అయినా ఇంకా పెద్ద సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు మిగిలిపోయాయి. దీనితో డ్రైవ్‌ను పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నా క్షేత్రస్థాయి అధికారుల్లో మాత్రం గందరగోళం కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేట్ కంపెనీ అవసరమైన లాగిన్‌లు ఇవ్వకపోవడంతోనే దరఖాస్తుల పరిష్కార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతున్నట్టు రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. దీనితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ధరణి' స్పెషల్ డ్రైవ్ ఉద్దేశం నెరవేరలేదన్న భావనలో రెవెన్యూ వర్గాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్‌లో పరిష్కారం కోసం వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 76,382 దరఖాస్తులను రెవెన్యూ యంత్రాంగం వివిధ స్థాయిల్లో పరిష్కరించింది. తహసీల్దార్, ఆర్డీవో, జేసీ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిల్లో ఆయా దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. కానీ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి కేవలం కలెక్టర్లు, సీసీఎల్ఏ వద్ద మాత్రమే డిజిటల్‌తోపాటు అధీకృత లాగిన్‌లు ఉన్నాయి. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు లాగిన్‌లు లేవు. గతంలో తహసీల్దార్లకు డిజిటల్ లాగిన్‌లు ఇచ్చినా.. దరఖాస్తులను పరిష్కరించినట్టుగా పేర్కొని అప్‌డేట్ చేసే అదీకృత లాగిన్‌లు లేవు. ఆ్యదీకృత లాగిన్‌లు ఇచ్చేందుకు మరో 10–20 రోజుల సమయం పడుతుందని 'ధరణి' నిర్వహణ కంపెనీ చెప్తున్నట్టు తెలిసింది. స్పెషల్ డ్రైవ్ ప్రారంభానికి ముందే.. అన్నిస్థాయిల్లో అదీకృత లాగిన్‌లు ఇవ్వాలని పోర్టల్ నిర్వహణ కంపెనీని కోరినట్టు రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. కానీ కంపెనీ ఇప్పటివరకు ఆ లాగిన్‌లు ఇవ్వలేదని.. పరిష్కారమైన దరఖాస్తుల్లోని భూముల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసే వీలు లేకుండా పోయిందని అంటున్నాయి. స్పెషల్ డ్రైవ్ కోసం ప్రభుత్వం పెట్టిన గడువు కూడా ముగిసింది. దరఖాస్తులు ఇంకా భారీగా పెండింగ్‌లో ఉండటంతో డ్రైవ్‌ను పొడగించాలని సర్కారు భావిస్తోంది. ఈ నేపథ్యంలో అన్నిస్థాయిల్లో లాగిన్‌లు వచ్చేదాకా పరిష్కారమైన దరఖాస్తుల వివరాలన్నీ కలెక్టర్ల లాగిన్‌లకు పంపి అక్కడి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే తీవ్ర పని ఒత్తిడి మధ్య ఉన్న కలెక్టర్ల పరిధిలో ఈ ప్రక్రియ కష్టమని స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టవద్దనే చర్చ ఉన్నతస్థాయిలో జరిగినట్టు తెలిసింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్ద జరిగిన చర్చల సందర్భంగా.. రెవెన్యూ శాఖలోని ముఖ్య అధికారి ఒకరు స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు అభ్యంతరం చెప్పారని, ఎన్నికల కోడ్ వస్తే ఆపేయాల్సి వస్తుందని సూచించారని సమాచారం. ఎన్నికల కోడ్‌కు, ధరణి సమస్యల పరిష్కారానికి ఎలాంటి సంబంధం ఉండదని.. 2017లో ప్రారంభమైన ఈ ప్రక్రియకు ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టాల్సిన అవసరం లేదని ధరణి కమిటీలోని ఓ సభ్యుడు చెప్పడంతో స్పెషల్‌డ్రైవ్ ప్రకటన జరిగిందనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం విధివిధానాలు రూపొందించే సమయంలోనూ ఇలాంటి సమస్య వచ్చిందని తెలిసింది. రాష్ట్రంలో రెగ్యులర్ సీసీఎల్ఏను నియమిస్తేనే ధరణి సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం సాధ్యమవుతుందని సీఎంతో జరిగిన చర్చల సందర్భంగా ధరణి కమిటీలోని సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నట్టు రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో 'ధరణి'పై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుంది? అన్నిస్థాయిల్లో లాగిన్‌లను ధరణి పోర్టల్ నిర్వహణ కంపెనీ ఎప్పటికి సమకూరుస్తుంది? స్పెషల్ డ్రైవ్ ఉద్దేశం ఏ మేరకు నెరవేరుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## జగద్గిరిగుట్ట సిఐ క్రాంతి కుమార్

కూకట్‌పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం) మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ లో ఎన్ వై కే కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది, ఆశా వర్కర్ లు, సమాజ సేవ చేస్తున్న మహిళలకు సన్మానం చేశారు .ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ... సమాజంలో మహిళలది గొప్ప పాత్ర ఉందన్నారు. మహిళలకు బాధ్యతలు అప్పజెప్పితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సర్వీస్ చేసే మహిళల్ని గౌరవించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కుమార్ యాదవ్ ను అభినందిచారు. అలాగే చదువుకునే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పిల్లలకి సమయం ఇచ్చి పిల్లల నడవడికను గమనించి, చెడు అలవాటును దరిచేరకుండా, సన్మార్గంలో నడిచే విధంగా క్రమశిక్షణ నేర్పుతు వారి భవిష్యత్తుకి పునాది వేయాలని అన్నారు. న్యాయవాది నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... మహిళా సాధించలేనిదంటు ఏమీ ఉండదని మహిళా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. చట్టసభలలో 33% మహిళలకు అవకాశాన్ని కల్పించి మహిళల గౌరవాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ మరింత పెంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలమిత్ర స్కూల్ కరస్పాండెంట్ ప్రత్యూష, సెన్సార్ బోర్డు సభ్యురాలు స్రవంతి మహిళా నాయకురాల్లో ద్రాక్షాయిని, శ్యామల, స్రవంతి, జ్యోతి, అనూష, అనిత, మునిషా, సత్య , జిహెచ్ఎంసి సిబ్బంది, ఆశ వర్కర్లు, కమలాకర్ రెడ్డి, ఆర్కే చారి, శ్రీకాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్

# మహబూబ్ నగర్ ఎంపీ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయం

## ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశి చంద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్ నగర్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచందర్ రెడ్డి

దేవరకద్ర, మార్చి10(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం దేవరకద్ర లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ... ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాభిమానాన్ని చురగొంటుందని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ ని గెలిపించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేసి నా గెలుపు కోసం సహకరించాలన్నారు. జియంఆర్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పార్లమెంట్ అభ్యర్థుల తొలి జాబితాలో మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానానికి టికెట్ పొందిన చల్లా వంశీచంద్ రెడ్డి తొలిసారిగా ఆదివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా ఎంపి అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి ని నాయకులు, కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మొదటి విడతలో ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , సోనియా గాంధీ , రాహుల్ గాంధీ , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు ఎమ్మెల్యే జయంఆర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ....ఈ ఎన్నికలు మనకు ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి ఇంచార్జి గా వ్యవహరిస్తున్న మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి, ఏఐసిసి నాయకులు రాహుల్ గాంధీ,సీఎం రేవంత్ రెడ్డి ల కు బహుమతిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేరి లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

# శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

## శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ లేక్ వ్యూ అపార్ట్మెంట్ వాసుల విజ్ఞప్తి మేరకు ప్రకాష్ నగర్ కొత్త కుంటా చెరువును సందర్శించిన అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలను వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల సంజీవ రెడ్డి, మనెపల్లి సాంబశివరావు, సంగారెడ్డి, హరి, సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, భారత్, కృష్ణ, పవన్, సూర్య తేజ, మల్లికార్జున్, శ్రీనివాస్ రావు, మస్తాన్ బాబు, జగదీశ్, చక్రవర్తి, మహిళలు మౌనిక, నవ్య, నళిని, అనిత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న హిందూ వాహిని ప్రతినిధులు

# రాష్ట్రంలోని అతిపెద్ద శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కొత్తకోటలో ఏర్పాటు చేయడం అభినందనీయం


## కొత్తకోట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి

కొత్తకోట, మార్చి10(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలోని శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ భారీ విగ్రహం కొత్తకోట పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి అభినందించారు. ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసిన హిందూ వాహిని కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శివాజీ మహారాజ్ ప్రతిష్టాపనకు ఆర్థిక సహాయం అందించాలని నరేందర్ రెడ్డిని హిందు వాహిని ప్రతినిధులు కోరగా వెంటనే స్పందించి తన వంతు సహాయంగా ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి 30 వేల రూపాయలు అందజేశారు. విగ్రహ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా జరగడంలో సహకరించిన ఎల్లంపల్లి నరేందర్ రెడ్డికి హిందు వాహిని కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు పూర్తయి ఆవిష్కరణ చేసిన సంగతి తెలిసిందే.ఈ విగ్రహ ప్రతిష్టాపనకు విరాళాలు అందించి సహకరించిన వారందరికీ శాలువాతో సత్కరించి శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ ప్రతిమను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని సభ్యులు శ్రీకాంత్ యాదవ్,ప్రహ్లాద్,హరి సింగ్,రఘు,మహేష్,నరేష్ , పలువురు వ్యక్తులు హిందు వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది

## ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం) సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త అని జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కొనియాడార్. ఆదివారం కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కె పి హెచ్ బి కాలని 5 వ ఫేస్ పార్టీ కార్యాలయం లో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రేమ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ... సావిత్రీబాయి పూలే తన జీవితాన్ని మహిళల హక్కులు, విద్య కోసం అంకితం చేసిందని, బాల్య వివాహాలు, కుల వివక్ష వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా కూడా ఆమె పోరాడారని, ఆమె సంఘ సంస్కర్త, విద్యావేత్త మరియు మానవతావాదితో పాటు సమృద్ధిగా మరాఠీ రచయిత్రి అని అన్నారు. ఈ కార్యక్రమములో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కోఆర్డినేటర్లు కొల్లా శంకర్ ,వేముల మహేష్ కలిగినిడి ,ప్రసాద్ ,అంజి సత్యసాయి, అన్నపురెడ్డి వెంకటస్వామి ,నా మన బుల్లి రాజు, ఆవుల రంగబాబు, బండారు వెంకటేష్, వెంకటేశ్వరరావు, పులగం సుబ్బు, శేఖర్, కిరణ్, తోట మురళి, సంపత్ కుమార్, సిద్ధార్థ, బాబు తదితరులు పాల్గొన్నారు.




సావిత్రి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రేమ్ కుమార్

# మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత

## కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 124 డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ఎంఎల్ఎన్ గార్డెన్స్ లో ఆదివారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలందరిని కార్పొరేటర్ సన్మానించి, బహుమతులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిగా లాలిస్తు, చెల్లిగా తోడుంటు, భార్యగా బాగోగులు చూస్తు, దాసిలా పనిచేస్తు కుటుంబ భారాన్ని మోస్తున్న మహిళలందరికీ పాదాభివందనాలు తెలియచేసారు. నేటి కాలంలోని మహిళలు విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, అంతరిక్షం, వంటి అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు అని కొనియాడారు. మహిళలను గౌరవించడం ప్రతీఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ఇంత అభివృద్ధి చెందిన ఆధునిక సమాజంలో కూడా ఇంకా మహిళలను చిన్న చూపు చూస్తూ, కించపరుస్తూ, వారి మీద అఘాయత్నాలు చేస్తున్న మానవ మృగలను కఠినంగా శిక్షించాలని అన్నారు. విధిరాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీక నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్నారు.. వారందరిని స్మరించుకుంటూ స్త్రీ మూర్తులందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు




మహిళలను సన్మానిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.